మలేరియాకు ముకుతాడు పడేనా?

2025లో పీడిత జిల్లాల్లో నమోదైన కేసుల వివరాలను ఓసారి పరిశీలిస్తే...

జిల్లా	కలహండి	రాయగడ	కొంధమాల్	కొరాపుట్	మల్కాన్‌గిరి	మయూర్‌భంజ్
కేసులు	13,034	10,913	8,342	6,950	6,533	5,000

గతేడాది అత్యధిక కేసులతో ప్రథమ స్థానంలో ఒడిశా

పీడిత జిల్లాల జాబితాలో రాయగడ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏటికేడు మలేరియా మహమ్మారి పంజా విసురుతోంది. ఏటా కేసుల తీవ్రత పెరుగుతుండటం రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది కేసుల పరంగా దేశంలోనే ఒడిశా ప్రథమ స్థానంలో నిలవడం గుబులు రేపుతోంది. పీడిత జిల్లాల జాబితాలో కలహండి తరువాత రాయగడ ఉండటం ఇక్కడి పరిస్థితుల తీవ్రత అద్దం పడుతోంది. మలేరియా మహమ్మారి కారణంగా ఈ ఏడాది జులైలో రాయగడలో ఇద్దరు, మల్కాన్‌గిరిలో మరో విద్యార్థి మరణించడం ఆరోగ్యభద్రత ప్రశ్నార్థకంగా మిగులుతోంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అశ్వథి.ఎస్. అధ్యక్షతన శనివారం మలేరియా, ఇతర వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణపై జరిగిన సాంకేతిక టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేసుల తీవ్రత అధికంగా ఉన్న కలహండి, రాయగడ, కొంధమాల్, కొరాపుట్, మల్కాన్‌గిరి, మయూర్‌భంజ్ తదితర జిల్లాలపై ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిసారించనుంది. ఆయా జిల్లాల్లో వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం అన్ని భాగస్వామ్య, సంస్థల సహకారంతో ముందుకు పోవాలని టాస్క్‌ఫోర్స్ నిశ్చయించింది. ముఖ్యంగా పీడిత ప్రాంతాల్లోని రెసిడెన్షియల్, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.


రాయగడలో దోమలకు నిలయంగా మారుతున్న పూడిక తీయని మురుగు కాలువ


మలేరియా పరీక్ష కోసం రక్తనమూనా సేకరిస్తున్న ఆశా కార్యకర్త

పెరుగుతున్న కేసులు

రాష్ట్రంలో గతంలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ గడిచిన మూడేళ్లలో మళ్లీ తీవ్రరూపం దాల్చుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. 2025లో అత్యధికంగా 62,137 కేసులతో రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగగా, అంతకుముందు 2024లో 68,693, 2023లో 41,973 కేసులు నమోదయ్యాయి. దోమతెరల పంపిణీ, అవగాహన, చైతన్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు యంత్రాంగం పేర్కొంటున్నా, అవి క్షేత్రస్థాయిలో జరగడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

400 కిలోల గంజాయి పట్టివేత

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా ఆబ్కారీ అధికారులు పెద్దమొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలిల్లోకి వెళితే... ఈ జిల్లా ఆబ్కారీ అధికారి బింబాధర్ పండా ఆదేశాల మేరకు ఆబ్కారీ బృందం శనివారం చిత్రకొండ సమితి పాపర్ మెట్ల రాణా ధులిపుట్ పంచాయతీ సురుబంధ గ్రామం వద్ద అడవిలో తనిఖీలు చేపట్టారు. అక్కడ 400 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

క్రీడాకారులను చూసి ఉత్కళ జనని గర్వించాలి

బిజూ పట్నాయక్ క్రీడా పురస్కార వేడుకల్లో సీఎం


అవార్డులందుకున్న వారితో మోహన్, ఇతర అతిథులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: క్రీడల్లో రాష్ట్ర యువతీ యువకులు అంతర్జాతీయ వేదికల్లో మెరుపులు మెరిపిస్తున్నారని, భవిష్యత్తులో రాష్ట్ర గౌరవం పెంచి ఉత్కళ జనని గర్వించే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆకాంక్షించారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ కేంద్రంలో ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రముఖ క్రీడాకారులకు బిజూపట్నాయక్ సాహస పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్ని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం రాష్ట్రంలో 314 సమితి కేంద్రాల్లో రూ.4,124 కోట్ల వ్యయంతో క్రీడామైదానాల నిర్మాణం చేపట్టిందని, భువనేశ్వర్‌లోని గౌరపట్నాలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఢెంకనాల్‌లో బాజిరౌత్ పేరిట రీజినల్ స్పోర్ట్స్ హబ్, మరో అయిదుచోట్ల ప్రాంతీయ హబ్‌ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు చెప్పారు. భారత్‌లో తొలిసారిగా ఒడిశాలో 'ఆసియన్, వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ ఛాంపియన్ షిప్' పోటీలు 2028లో చేపట్టనున్నామని సీఎం తెలిపారు.

వీరికి సత్కారాలు

2025 బిజు సాహస క్రీడా పురస్కారాలను సౌమ్యరంజన్ బెహరా, మరణానంతరం నీలమాధవ పండా, సునీల్‌కుమార్ రాయ్‌ల కుటుంబీకులకు సీఎం కేటాయించారు. ప్రణతి మిశ్రాకు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. సంబల్‌పూర్ శామలేశ్వరి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రాకు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్, క్రీడల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి భూపేంద్ర సింగ్ పుణియా, సంచాలకుడు ఎద్దుల విజయ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

జీఐఈటీ విశ్వవిద్యాలయానికి ఇండియా బ్రాండ్ ఐకాన్ అవార్డు-2026


క్రికెటర్ గవాస్కర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న చంద్రధ్వజ పండా

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం జీఐఈటీ విశ్వవిద్యాలయానికి మరో అరుదైన పురస్కారం లభించింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, కార్పొరేట్ సంబంధాల రంగంలో తూర్పు భారత దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా నిలిచినందుకు జీఐఈటీ విశ్వవిద్యాలయానికి ప్రతిష్ఠాత్మక ఇండియా బ్రాండ్ ఐకాన్ అవార్డు-2026 లభించింది. ముంబయిలో టైమ్ సైబర్ మీడియా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు చంద్రధ్వజ పండా భారత దిగ్గజ మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ విజయం గుణుపురం పట్టణం, రాయగడ జిల్లాకు గౌరవం తీసుకొచ్చిందని ప్రముఖులు అన్నారు.

విడాకులు పొందిన మహిళలకు ఊరట

● మాజీ భర్త జీతం నుంచి కొంత మొత్తం వారి ఖాతాలకు బదిలీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భార్యలకు విడాకులిచ్చిన ఉద్యోగుల్లో చాలామంది న్యాయస్థానాల తీర్పులను గౌరవించడం లేదు. జీతంలో ప్రతినెలా మాజీ భార్యకు పోషణ, ఇతర ఖర్చుల కోసం కొంత మొత్తం చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదివారం స్వయంగా ప్రస్తావించారు. తాను చేపడుతున్న సీఎం వినతుల స్వీకరణ కార్యక్రమంలో ప్రతిసారి ఇద్దరు, ముగ్గురు విడాకులు పొందిన మహిళలు తమ ఇబ్బందులు చెప్పుకుంటున్నారని, తాను వింటూ ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. ఇలా న్యాయస్థానాల ఉత్తర్వులు గౌరవించని ఉద్యోగుల జీతాల నుంచి ప్రతినెలా పోషణ వ్యయం వారు వదిలేసిన భార్యల బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తామన్నారు. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని డ్రాయింగ్ అండ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కోర్టులు పేర్కొన్న మొత్తాలు నెలనెలా చెల్లించి, మిగతా జీతం ఉద్యోగులకు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. దీనిపై సీఎంవో అధికారవర్గాలు ప్రకటన జారీ చేశాయి.

అమ్మ భాషను గౌరవిద్దాం... రేపటి తరానికి నేర్పిద్దాం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తేనెలొలుకు తెలుగుభాషను ఉత్కళాంధ్రులంతా గౌరవించాలని, పిల్లలకు మాతృభాష ప్రాధాన్యం వివరించి బోధించాలని వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కటకలోని 'ఐక్యత' సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యత కార్యదర్శి డాక్టర్ ఇటూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలుగుభాషకు నుడికారాలు దిద్ది, ఔన్నత్యం, తీయదనం గురించి చాటిన గిడుగు రామ్మూర్తి పంతులు గురించి విపులంగా వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న షోలాపురి అమ్మవారి ఉత్సవ సంఘం మాజీ కార్యదర్శి దోర చిన్నారావు తెలుగు భాష, గౌరవం విశ్వవ్యాప్తం చేసిన కవులు, రచయితల గురించి చెప్పారు. కార్యక్రమంలో రామలింగేశ్వరరావు, సూర్యారావు, పల్లవి, జయభారతి, రాధారాణి తదితర తెలుగు పెద్దలు పాల్గొన్నారు. 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' గీతాలపన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


వేడుకలో పాల్గొన్న 'ఐక్యత' ప్రతినిధులు

ప్రభావం చూపుతున్న తీవ్ర పీడనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా, బెంగాల్ సరిహద్దులో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం మరింత బలం పుంజుకుని అదేచోట స్థిరంగా కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా సముద్ర ఉపరితలంలో 7.6 కిలోమీటర్ల ఎత్తులో మరో ఆవర్తనం కొనసాగుతున్నట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి బి.కె. త్రిపాఠి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. తీవ్ర పీడనం సోమవారం నాటికల్లా బెంగాల్‌లోని గాంగేటిక్ తీరానికి ప్రయాణిస్తుందన్న అంచనా ఉందన్నారు. మంగళవారం (1) వరకు రాష్ట్రంలో భారీ వర్షాలకు అవకాశం ఉందని సోమవారం(31న) అన్ని కేంద్రాల్లో మోస్తరు నుంచి అతి భారీగా ఉంటుందన్న అంచనాగా రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. బాలేశ్వర్, కేంఝర్, మయూర్‌భంజ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించామని, సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు జారీ చేసిన హెచ్చరికలు అమల్లో ఉంటాయన్నారు.

గడిచిన 24 గంటల్లో కురిసిన వర్షపాతం వివరాలు

కేంద్రం	వర్షం (సెం.మీ.లలో)
రాజ్‌ఘాట్ (బాలేశ్వర్)	16
కుసుమి (మయూర్‌భంజ్)	13
లఠికట (సుందర్‌గఢ్)	11
జలేశ్వర్ (బాలేశ్వర్)	9
కె.నువాగాం (కొంధమాల్)	9
టి.రాంపూర్ (కలహండి)	8
మర్శాఘాయి (కేంద్రపడ)	8
గడ్వేలా (బొలంగీర్)	7
బరిగుడ (కొంధమాల్)	7
బరిశంకరా (సుందర్‌గఢ్)	7
కంటామాల్ (బౌద్ధ్)	7
కేంద్రపడ	7
బమ్రా (సంబల్‌పూర్)	6

రాష్ట్రంలోని ఇతర కేంద్రాల్లో 2 నుంచి 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది

అక్టోబరు 29 నుంచి ఓఏఎస్ మెయిన్స్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా పాలనా విభాగం (ఓఏఎస్) మెయిన్స్ అక్టోబరు 29 నుంచి నవంబరు 7 వరకు నిర్వహించనున్నారు. మెయిన్స్ రెండు సిటింగ్‌లలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు చేపడతామని అధికారవర్గాలు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపాయి. ఓఏఎస్ ప్రిలిమినరీ పరీక్షలు జూన్ 7న బాలేశ్వర్, బ్రహ్మపుర, భువనేశ్వర్, కటక, జయపురం, సంబల్‌పూర్ జోన్‌లలో జరిగాయి. జులై 10న ఫలితాలు ప్రకటించారు. 5,690 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరంతా అక్టోబరు, నవంబరు నెలల్లో నిర్వహించే మెయిన్స్ రాస్తారు.

విజిలెన్స్ వలలో ఏఎస్సై


మదన్‌మోహన్ ప్రధాన్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అరెస్టుల బెదిరింపుతో ఓ వ్యక్తి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏఎస్సై విజిలెన్స్ అధికారులకు చిక్కారు. విజిలెన్స్ వర్గాల సమాచారం మేరకు.. సుందర్‌గఢ్ జిల్లా లొహునిపొడ పోలీసు స్టేషన్‌లో మదన్‌మోహన్ ప్రధాన్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక ఓ భోజనశాల యజమాని, ఆయన సోదరుడిపై ఆబ్కారీ కేసులు బనాయించి, కోర్టుకు తరలిస్తానని ప్రధాన్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీని నుంచి తప్పించుకోవాలంటే రూ. 20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించగా, లంచం తీసుకుంటూ ప్రధాన్, ఆయన వ్యక్తిగత సహచరుడు మణిదీప్ కుమార్‌లు చిక్కారు. కేసు నమోదు చేసుకొని ప్రధాన్ అధికారిక నివాసం, కార్యాలయ ఛాంబర్, మహుల్‌దిహ గ్రామంలోని ఆయన సొంత నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

భార్యను వేధిస్తున్న ఎస్సై అరెస్టు


గణనాథ్ శెఠి

భార్యను వేధిస్తున్నారన్న ఆరోపణలపై ఓ ఎస్సైను భద్రక్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రక్ టౌన్ పోలీసుస్టేషన్‌లో గణనాథ్ శెఠి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. శెఠి తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీర్ఘకాలంగా జరుగుతున్న ఈ సమస్య పరిష్కారానికి పలుమార్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గణనాథ్‌ను అరెస్టు చేశారు. విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తుర్లపాటి రాజేశ్వరికి సత్కారం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బెంగళూరు (కర్ణాటక)లో వ్యాలికావల్‌లోని శ్రీ కృష్ణదేవరాయ సభా మందిరంలో శనివారం కర్ణాటక రాష్ట్ర తెలుగు సంఘాల ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బ్రహ్మపురకు చెందిన ప్రముఖ రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు. డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ భాషాభిమానులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.


డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరిని సత్కరిస్తున్న అతిథులు. చిత్రంలో నిర్వాహకులు

భారత 'ఏ' మహిళా జట్టులో శుశ్రీ దివ్యదర్శినికి స్థానం


శుశ్రీ దివ్యదర్శినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోచ్ ఖిరోద బెహర

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో గల ధర్మశాలలో రానున్న సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 2 వరకు భారత్ ఏ మహిళా, ఆస్ట్రేలియా ఏ మహిళా జట్ల మధ్య మల్టీ డే మ్యాచులు జరగనున్నాయి. ఇందులో భారత ఏ జట్టులో జాగృతి క్రికెట్ అకాడమీ (భువనేశ్వర్)కి చెందిన ఆల్‌రౌండర్ శుశ్రీ దివ్యదర్శిని స్థానం పొందింది. కొత్త చండీగఢ్, మొహలి మైదానాల్లో నిర్వహించనున్న మూడు టీ 20లు, మూడు వన్డే మ్యాచుల్లో భారత జట్టుకు శుశ్రీ ఆల్‌రౌండర్‌గా ఆడనున్నట్లు ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ) ప్రతినిధులు చెప్పారు. జట్టులో చోటు సంపాదించిన ఆమెకు ఓసీఏ అధ్యక్షుడు పంకజ్‌లోచన్ మహంతి, కార్యదర్శి సంజయ్ బెహర, కోచ్ ఖిరోద బెహర తదితరులు శుభాభినందనలు తెలిపారు.

1,632 దగ్గుమందు సీసాల స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నషాముక్త్ ఒడిశా అభియాన్‌లో భాగంగా ఝార్సుగుడ పోలీసులు ఇద్దరి నిందితులను అరెస్టు చేసి 1,632 దగ్గుమందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఝార్సుగుడ ఎస్పీ జి.ఆర్.రాఘవేంద్ర మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం... బొడ్మల్ స్టేషన్ పరిధి శిబ్‌రాంపూర్ ప్రాంతంలో అక్రమంగా దగ్గుమందు సీసాల విక్రయం జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది దాడులు జరిపి ఓ నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దగ్గుమందు సీసాలను ఇక్కడికి సరఫరా చేస్తున్న మరో నిందితుడ్ని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఝార్సుగుడ జిల్లా కొలబిర స్టేషన్ గుచ్ఛపల్లి గ్రామానికి చెందిన సాహిల్ పటేల్(26), బొడ్మల్ స్టేషన్ పరిధి శిబ్‌రాంపూర్‌నకు చెందిన సంజయ్ రోహిదాస్(21)ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న దగ్గుమందు సీసాల బస్తాలు. పోలీసుల అదుపులో నిందితులు

నవీన్ జీ.. అవగాహన లేకుండా మాట్లాడకండి


ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'నవీన్ జీ.. 25 ఏళ్లు సీఎంగా పనిచేసిన మీరు ఎంఎండీఆర్ బిల్లుపై అవగాహన లేకుండా మాట్లాడటం, ఎంపీలకు లేఖలు రాయడం తగదు' అని సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. విపక్ష నేత, బిజద అధినేత నవీన్ పట్నాయక్ రాష్ట్రానికి చెందిన 20 మంది భాజపా ఎంపీలకు బిల్లును వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని లేఖలు రాసిన సంగతి తెలిసిందే. స్పందించిన ధర్మేంద్ర తిరిగి సమాధానమిస్తూ నవీన్‌కు లేఖ రాశారు. ఆమోదం పొందిన బిల్లు సారాంశం నవీన్ చదవకపోయి ఉండొచ్చని, ఇది రాష్ట్రానికి నష్టం చేస్తుందని పేర్కొనడం సబబు కాదన్నారు. వాస్తవానికి ఒడిశాకు ఎక్కువగా లాభిస్తుందని, 90 శాతం రాబడి సమకూరుతుందని తెలిపారు. ఏడాదిలో రూ.12 వేల కోట్లు నష్టం వస్తుందని బిజద పెద్దలు పేర్కొనడం వాస్తవం కాదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఒడిశా ప్రయోజనాలు కాలరాసే నిర్ణయం తీసుకోరని, ఆయన రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో ఉన్నారని ధర్మేంద్ర పేర్కొన్నారు.

హైనా పిల్లల స్వాధీనం


గుంతలో హైనా పిల్లలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఓ గుంత నుంచి వింత శబ్దాలు వినిపించడంతో గ్రామస్థులు వెళ్లి చూడగా రెండు హైనా పిల్లలు కనిపించాయి. ఈ ఘటన నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితి బబాయి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... రెండు హైనా పిల్లలను గ్రామస్థులు గుర్తించి అటవీశాఖకు సమాచారం అందజేయగా, ఫారెస్టర్ అనిరుధ్ విశ్వాల్ నేతృత్వంలో పిల్లలను కాపాడి, పశు వైద్య కేంద్రానికి తరలించారు. వాటి ఆరోగ్యం కుదుట పడితే సురక్షితంగా అడవిలోకి విడిచి పెడతామని తెలిపారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచడానికి వ్యవసాయశాఖ నిర్ణయించి, రైతులను ఈ దిశగా అవగాహన కల్పిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని కృషి భవన్‌లో 'ఫెర్టిలైజర్ ఇన్నోవేషన్ సెంటర్ ఇండియా' (ఎఫ్ఐసీ) ప్రతినిధుల సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సింగ్‌దేవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంటలకు రసాయన ఎరువులు పరిమితంగా వినియోగించాలన్న దానికి కట్టుబడి ఉన్నామని, ప్రజారోగ్యానికి సేంద్రియ ఉత్పత్తులు సాధించడానికి ఎఫ్ఐసీ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌లో ఎఫ్ఐసీ అకాడమీ ప్రారంభించి అధికోత్పత్తుల సాధనకు పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సచిన్ రామచంద్రయాదవ్, సంచాలకుడు శుభం సక్సేనా, ఎఫ్ఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సింగ్‌దేవ్

ప్రధాని నోట మైథిలి మాట


మన్‌కీ బాత్‌లో మాట్లాడుతున్న మోదీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ జిల్లా దెబ్రిగఢ్ అటవీ ప్రాంతం గిరిజన యువతి మైథిలి భుయ్యా ప్రధాని నరేంద్రమోదీ మన్ననలందుకున్నారు. ఆదివారం మోదీ 137వ 'మన్‌కీబాత్' ఆకాశవాణి కార్యక్రమంలో మైథిలి విజయగాథ ప్రస్తావించి ఆమె మహిళాభ్యుదయానికి ప్రతీకగా అభివర్ణించారు.

60 మందికి ఉపాధి


మైథిలి

దెబ్రిగఢ్‌కు చెందిన మైథిలి విస్తరాకులు, తేనె సంగ్రహించి కుటుంబ పోషణ చేసుకునేవారు. ఇటీవల కాలంలో ఎకో టూరిజాన్ని ఆసరాగా చేసుకుని అటవీ సంపద ఎగుమతుల్లో రాణిస్తున్నారు. సేద్యం, తేనె సేకరణ రంగాల్లో నైపుణ్యం సాధించారు. గ్రామానికి చెందిన 60 మందికి ఉపాధి కల్పిస్తూ గిరిజన మహిళలకు ఆదర్శప్రాయమయ్యారు. మన్‌కీబాత్ కార్యక్రమంలో మైథిలి గురించి పేర్కొన్న మోదీ ఒడిశాలోని కొండకోనల్లో ఉన్న ఓ మహిళ ఎందరికో ప్రేరణగా, ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి: సీఎస్


అధికారులతో మాట్లాడుతున్న అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మాతా, శిశు సంక్షేమం, క్షయ వ్యాధి నివారణకు సంబంధించి అమలవుతున్న 'ప్రయాస' కార్యక్రమాలు విజయవంతం చేయాలని, ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ ఆదేశించారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో 'ప్రయాస' కార్యక్రమం అమలు, ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఆదివాసీ ప్రాంతాలు, కొండకోనల్లో ఉంటున్న కుటుంబాల పిల్లల పోషణ, చదువులకు ప్రాధాన్యమివ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. దేశంలో క్షయవ్యాధిని అంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అభివృద్ధి కమిషనర్ దేవ్‌రంజన్ కుమార్‌సింగ్, ఇతర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయం లేదా.. స్మరించలేరా?



బినాయక ఆచార్య విగ్రహం (వృత్తంలో) ముందు గేటుపై అడ్డంగా ప్రచార ఫ్లెక్సీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు, ఆదర్శ ఉపాధ్యాయుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి బినాయక ఆచార్య జయంత్యుత్సవాన్ని విస్మరించిన బీఈఎంసీ తీరును స్థానిక పూజ్య పూజా సమితి విమర్శించింది. ఆదివారం ఆచార్య జయంత్యుత్సవం నేపథ్యంలో బీఈఎంసీ ఆధ్వర్యంలో స్థానిక అస్కా రోడ్డులోని బినాయక ఆచార్య ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేయలేదని సమితి ప్రతినిధి అబనీ గయా ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పాఠశాల గేటుకు తాళం వేసి ఉండగా, విగ్రహానికి ఎదురుగా గేటుపై అడ్డంగా ఓ ప్రైవేటు సంస్థ ప్రచార ఫ్లెక్సీని అమర్చిందని ఆయన పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట: మంత్రి సురేష్


సమావేశంలో మంత్రి సురేష్, ఎస్ఆర్‌సీ రాజేష్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా తీరానికి అలలకోత ముప్పు నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, బ్లూ ఎకానమీకి పెద్దపీట వేసిన ప్రభుత్వం ఈ దిశగా ముమ్మర కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టినట్లు రెవెన్యూ, విపత్తు నియంత్రణ శాఖల మంత్రి సురేష్‌పూజారి చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో విపత్తుల నియంత్రణ శాఖ 'అడాప్టివ్ రెసిలియన్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ కోస్టల్ సిస్టమ్స్ అన్ ఎకానమిక్స్' (ఎరైజ్) అన్న అంశంపై ఉన్నత స్థాయి సమావేశం మంత్రి సురేష్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆసియన్ అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో ఏడీబీ, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తీర సంరక్షణకు శాశ్వత నిర్మాణాలు చేపట్టాయి. ఈ తరహాలో ఒడిశా ప్రభుత్వం ఏడీబీతో కలిసి పనులు ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు. ఎరైజ్ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తీర పట్టణాలు, గ్రామాల్లో శాశ్వత నిర్మాణాలు, ఆయా ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాల్లో అభివృద్ధి ధ్యేయంగా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. సమావేశంలో ప్రత్యేక రిలీఫ్ కమిషనర్(ఎస్ఆర్‌సీ) రాజేష్‌ప్రభాకర్ పాటిల్, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఓఎస్‌డీఎంఏ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తీర ప్రాంతాల పరిస్థితి ప్రదర్శించారు.

ప్యానెల్ న్యాయవాదులకు శిక్షణ

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో జిల్లా న్యాయవాదుల అథారిటీ తరపున ప్యానెల్ న్యాయవాదులకు ఆదివారం ప్రత్యేక శిక్షణ శిబిరం జరిగింది. అథారిటీ కార్యదర్శి ప్రద్యుమ్నయి సుజాత, జిల్లా న్యాయమూర్తి ప్రదీప్ కుమార్ మహంతి, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ మధుస్మిత జెనా తదితరులు న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు.

పేర్లు నమోదుకు మరో వారం రోజులు

గుణుపురం, న్యూస్‌టుడే: రైతులు ఖరీఫ్ ధాన్యం మండీల ద్వారా ధాన్యం విక్రయాల కోసం ల్యాంప్స్‌లో రైతుల పేర్లు నమోదు జరుగుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం మరో వారం రోజులు అదనంగా ప్రకటించింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయ సేవలపై అవగాహన

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో ఆదివారం న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి బార్ సభ్యుడు ఆర్.బాబురావు, సఖి-వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ సునీత రథ్ పాల్గొన్నారు.


విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

గుణుపురం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తామని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ప్రత్యేక అభివృద్ధి మండలి(ఎస్డీసీ) అధ్యక్షుడు బిద్యాధర సబర అన్నారు. ఆదివారం గుణుపురం బంగ్లాలో మాట్లాడారు. శనివారం భీంపూర్, గొట్లపొదర్ గ్రామాల్లోని ఆశ్రమ విద్యాలయాల్లో పర్యటించి స్వయంగా విద్యార్థులతో మాట్లాడానని తెలిపారు.

సెప్టెంబర్ 15న పశ్చిమ నువాఖాయ్ వేడుకలు


బరగఢ్, న్యూస్‌టుడే: పశ్చిమ ఒడిశాలో నువాఖాయ్ పండుగను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. బరగఢ్, సంబల్‌పూర్, బొలంగీర్, సోన్‌పూర్, కలహండి, నువాపడా, బౌద్ధ్ తదితర జిల్లాల్లో నూతన పంటతో దేవతలకు నవాన్న భోగం సమర్పించి, అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి నవాన్నాన్ని స్వీకరిస్తారు. సెప్టెంబర్ 15న ఈ పండగ జరుపుకోనున్నారు.

మత్తుతో జీవితం చిత్తు


గ్రామస్థులతో పోలీసు సిబ్బంది


పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని దానికి దూరంగా ఉండాలని గజపతి జిల్లా పోలీసులు అన్నారు. ఆదివారం మోహన ఠాణా పరిధిలోని సన్నఖాని, బడఖాని, కిరంబా గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 'నషా ముక్త్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత నేరాల బాట పడుతుందని పేర్కొన్నారు.

సెల్ఫీ తీసుకుంటూ.. తిరిగిరాని లోకాలకు


బిశోయి(పాతచిత్రం)

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి తయంగీర్ జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటూ నదిలో గల్లంతైన బాలుడు జెక. బిశోయి(16) మృతదేహం శనివారం సాయంత్రం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గొడిబలి పంచాయతీ జెరక గ్రామానికి చెందిన జెక. బిశోయి స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ సెల్ఫీ తీసుకుంటుండగా నదిలో జారిపడి గల్లంతయ్యాడు తోటివారు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది రెండు రోజులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

నదిలో మునిగి వృద్ధుడి మృతి


వృద్ధుని మృతదేహాన్ని మోసుకెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాశీనగర్, న్యూస్‌టుడే: వంశధార నదిలో వృద్ధుడు గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. గల్లంతైన వ్యక్తి కాశీనగర్ 2వ వార్డుకు చెందిన ఎం. లచ్చయ్య(65)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎం.లచ్చయ్య బహిర్భూమి కోసం వంశధార నదికి వెళ్లి అనంతరం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని నదిలోని పలు ప్రాంతాల్లో గాలించి వృద్ధుడి మృతదేహాన్ని కొత్త కాశీనగర్ అమ్మవారిగుడి సమీపంలో వెలికితీశారు.

బంగారు గొలుసుతో చిక్కిన నిందితుడు


షేక్ ఫిరోజ్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఉల్ బేరియా రైల్వేస్టేషన్‌లో శనివారం కదులుతున్న ఒక రైలులోని ఓ మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకొని రైలు దిగి పారిపోతున్న నిందితుడ్ని జీఆర్పీ పోలీసుల పట్టుకున్నారు. బంగారు గొలుసు 9.58 గ్రాములని తెలిపారు. నిందితుడు షేక్ ఫిరోజ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

చరవాణుల చోరీ కేసులో మరొకరు..

ఖరగ్‌పూర్ జీఆర్పీ పోలీసులు పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల నుంచి దొంగలించిన మూడు చరవాణులతో పులిన్‌సింగ్(28)ను అరెస్టు చేశారు. నిందితుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు.

మూగ యువతిపై అత్యాచారయత్నం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మానసిక వ్యాధిగ్రస్థురాలు, మూగ యువతిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ప్రతిఘటించిన యువతిపై దాడి చేయగా, ఆమె కేకలు విన్న ఇరుగు పొరుగు వారు అక్కడికి రావడంతో పెరటివైపు పారిపోతున్న యువకుడ్ని గ్రామస్థులు పట్టుకుని చితకబాదారు. అనంతరం ఆయనను పోలీసులకు అప్పగించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సమీపంలోని చుడంగపూర్ గ్రామానికి చెందినవాడిగా తెలిసింది.

డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డ కారు

గంజాం జిల్లా పురుషోత్తంపూర్ ఠాణా పరిధిలో బ్రహ్మపుర-పురుషోత్తంపూర్ ప్రధాన రహదారిలోని తరాతరిణి కూడలి వద్ద శనివారం రాత్రి ఓ కారు అదుపుతప్పి రహదారి మధ్యలోనున్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న బ్రహ్మపుర సిద్ధార్థనగర్‌కు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రుల్ని కాపాడి పురుషోత్తంపూర్‌లోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వారి ఆరోగ్యం విషమించడంతో నలుగుర్నీ స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి స్థానాంతరం చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


క్రీడల్లో రాణించి గౌరవం పెంచాలి

● వినయ్‌తోష్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న వారు క్రీడల్లోనూ రాణించి గౌరవం పెంచాలని ఇన్‌ఛార్జి డీజీపీ వినయ్‌తోష్ మిశ్రా కోరారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని డీజీపీ క్యాంప్ కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఆగస్టు 8, 9 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 'జయక్రీడల ఛాంపియన్ షిప్-2026'లో రాష్ట్రానికి చెందిన ఇద్దరికి పసిడి, అయిదుగురికి సిల్వర్, ఒకరికి కాంస్య పతకం వరించింది. విజేతలను సత్కరించిన ఇన్‌ఛార్జి డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


పసిడి పతకం విజేత రశ్మితాసాహుకు బహుమతి ఇస్తున్న ఇన్‌ఛార్జి డీజీపీ మిశ్రా

కోచ్‌లకు శిక్షణ.. బ్లాక్ బెల్టు పరీక్షలు


పతకాలతో క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా కరాటే సంఘం, ఉత్కళ కరాటే స్కూల్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27లలో రాష్ట్ర కరాటే కోచ్‌లకు శిక్షణ శిబిరం, బ్లాక్ బెల్టు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో వివిధ జిల్లాల క్రీడాకారులు రాణించారు. స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటైన ఇందులో ఓవరాల్‌గా ఖోర్ధా జిల్లా బ్లాక్ బెల్టులు సాధించి మొదటిస్థానంలో నిలవగా మయూర్‌భంజ్ జిల్లా రెండో స్థానం పొందింది. వివిధ జిల్లాలకు చెందిన అరవై మంది శిక్షకులు తర్ఫీదు పొందారు. శిబిరంలో వివిధ కేటగిరీలలో పలువురు మొదటి, రెండు, ఆరో డాన్ బ్లాక్ బెల్టులు కైవసం చేసుకున్నట్లు శిక్షకుడు హరిప్రసాద్ పట్నాయక్ ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

యంత్రాంగం అండగా ఉంటుంది


నర్సరీని పరిశీలిస్తున్న పాలనాధికారి మనోజ్, ఇతర అధికారుల బృందం


సిమిలిగుడ, న్యూస్‌టుడే: దశమంత్‌పూర్ సమితిలో పాలనాధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్ శనివారం సాయంత్రం పర్యటించి అభివృద్ధి పనులు సమీక్షించారు. అక్కడ ఒడిశా ఆదర్శ విద్యాలయం పనితీరు, సమీపంలోని కాఫీ నర్సరీని పరిశీలించారు. మహిళలు, రైతులతో మాట్లాడారు. కౌగుడలో బంగాళదుంపలు, స్ట్రాబెరీ పంటలను చూశారు. ప్రజలకు యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి వేణుధర్ సబర్, దశమంత్‌పూర్ సమితి అభివృద్ధి అధికారి సిద్దేశ్వర నాయక్, తహసీల్దార్ ప్రియా పుష్పాంజలి బెహరా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అక్షయశక్తి ప్రాజెక్టులు ప్రగతి రథచక్రాలు


కంపెనీ ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అక్షయశక్తి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతి రథ చక్రాలుగా నిలుస్తున్నందున ఈ దిశగా ప్రోత్సహిస్తున్నామని, ఇటీవల కాలంలో గ్రీన్ ఎనర్జీ నిర్మాణాలకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని విద్యుత్తుశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని ఖారవేళ భవన్‌లో గ్రీన్ ఎనర్జీ సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న 'మ్యాక్‌లెక్' ప్రతినిధులు, విద్యుత్తు శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి విశాల్‌కుమార్ దేవ్, ఓపీటీసీఎల్ సీఎండీ భాస్కరజ్యోతిశర్మ, గ్రిడ్కో సంచాలకుడు సత్యప్రియరథ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు అక్షయశక్తి నిర్మాణాలు, ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సింగ్‌దేవ్ విలేకర్లతో మాట్లాడుతూ 'మ్యాక్‌లెక్' కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం కనబరుస్తున్న నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

'ఆర్కిడ్' పూల సోయగం




అందం, భావోద్వేగాలకు ప్రతీకలుగా ప్రసిద్ధి గాంచిన 'ఆర్కిడ్' పూల అందాలు చూపరులకు నేత్రానందాన్ని కలిగిస్తున్నాయి. గంజాం జిల్లా రొంగాయిలొండ సమితిలో కొరాపల్లి సమీపాన గంజాం జిల్లా పూల ఉత్పత్తిదారుల సంఘం ముఖ్యుడు ఎ.శ్రీధర్ వర్మ ఈ పూలను సాగు చేస్తున్నారు. సుమారు ఎకరా స్థలంలో రెండు రంగుల్లో ఆర్కిడ్ పూలను సాగు చేస్తున్నట్లు శ్రీధర్ వర్మ ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. -న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఆసుపత్రిలో సేవలు అందుతున్నాయా?


రోగి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. ఆసుపత్రిలో ఉన్న వార్డులను పరిశీలించి సేవలు ఎలా ఉన్నాయని రోగులను ప్రశ్నించారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రోగుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

వర్షంలోనూ ఉత్సాహంగా ప్రచారం



వర్షంలో తడుస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'జాతీయ నేత్రదాన పక్షోత్సవాల' సందర్భంగా స్థానిక 'ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్' (ఎఫ్‌హెచ్‌సీ) ఆధ్వర్యంలో వివిధ సంస్థల సహకారంతో ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించింది. ఉదయం స్థానిక నీలకంఠనగర్ హౌసింగు బోర్డు కాలనీ కూడలి వద్ద ప్రారంభమైన ర్యాలీకి బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి అతిథిగా పాల్గొని జెండా ఊపారు. అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులు ప్రధాన రహదారుల మీదుగా ప్లకార్డులతో ర్యాలీగా గజపతి కూడలిలోని క్లబ్ స్నేహం భవనం వద్దకు చేరుకున్నారు. నిరవధికంగా కురుస్తున్న వర్షంలోనూ ప్రతినిధులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించండి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని జంగం వీధి ప్రాంతంలో ఎస్ఏ కల్యాణ మండపంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం సభ్యులు సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు బి.గోపాలరావు మాట్లాడుతూ క్రమబద్ధమైన నియామకాలను రద్దుచేసి శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తామని చెప్పి నెలలు దాటుతున్న ఎలాంటి పరిష్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని పేర్కొన్నారు.

సైకిల్ వినియోగంతో ఆరోగ్యం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పర్లాఖెముండి, రాయగడ పట్టణం, రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్లాఖెముండి పట్టణంలో జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పాల్గుణ మాఝి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగింది. ● జిల్లా కేంద్రంలో ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ రవీంద్రకుమార్ కొహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ● క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదివారం మునిగుడలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బిసంకటక్ ఎస్డీపీవో సంతోషిని ఓరం, ఐఐసీ లలిత్ సాగర్, పోలీసు సిబ్బందితో పాటు స్థానిక యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు చేదోడు

నవరంగపూర్, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కారణంగా ఏర్పడిన వరదలకు ప్రభావితమైన బాధితులకు సేవాచైల్డ్ అంతర్జాతీయ సంస్థ సహాయం అందజేసింది. నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితి బారువాముండా, చకల పొదర, కంగ్రా, హల్దిగుండి, డాయిమాల గ్రామాల్లో బాధితులకు రేషన్ కిట్లను అందజేశారు. సంస్థ సభ్యులు వారికి అవసరమైన నిత్యావసర సామగ్రిని అందజేశారు.


రేషన్ కిట్లతో బాధితులు

రోగులకు వస్త్రాలు, ఆహారం పంపిణీ


బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక, సేవా సంస్థ 'సఖి' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్కేసీజీ ఆసుపత్రిలోని రోగులకు వస్త్రాలు, పండ్లు, ఇతర ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వీటీ సాహు తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో రోగులకు వస్త్రాలు తదితరాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వంశధార సాహిత్య సమాజ్ కమిటీ ఎంపిక

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం వంశధార సాహిత్య సమాజ్ నూతన కార్యవర్గ కమిటీ ఎంపిక ఆదివారం గుణుపురం పట్టణంలో జరిగింది. అధ్యక్షులుగా సింహాచల కొరా, ఉపాధ్యక్షులుగా కైలాస్ చంద్ర దాస్, కార్యదర్శిగా రమేశ్ మిశ్రా ఎంపికయ్యారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


విద్యార్థినిని కలిసిన అధికారులు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక జిల్లాలో ఎంపీ నిధులు వెచ్చించి చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం బందుగాం సమితికి చెందిన గిరిజన బాలిక కవితా హికాక విజయవంతంగా వైద్య విద్యను పూర్తి చేసుకోవడంపై ఆమెను కలిసి అభినందించారు.

భావి భారతదేశం కోసం విద్యాసంస్థలు కృషి చేయాలి



వేదికపై ఎమ్మెల్యేలు పవిత్ర, మచ్చొ తదితరులు


సిమిలిగుడ, న్యూస్‌టుడే: భావి భారతదేశం కోసం విద్యాసంస్థలు కృషి..పనిచేయాలని, కీలకపాత్ర వహించాలని ఎన్ఐఎస్ఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిరేంద్ర నాథ్ అన్నారు. కొరాపుట్ కేంద్ర విశ్వవిద్యాలయం 18వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం రాత్రి సునాబెడలో ప్రధాన క్యాంపస్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హిరేంద్ర నాథ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యేలు పవిత్రశాంత, రఘురాం మచ్చొ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబసభ్యులతో సాదు నేపాక్

బరగఢ్, న్యూస్‌టుడే: నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదల్లో బరగఢ్ సమితి సరలా గ్రామానికి చెందిన గున్నం జయ కృష్ణ భార్య, ఏడాదిన్నర వయసున్న కుమార్తె గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాధు నేపాక్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.


బ్యాటింగ్, బౌలింగ్‌లో యువ క్రికెటర్ల ప్రతిభ


ఉమేష్ కె గౌతమ్


సాయిదీప్ మహాపాత్ర్


బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో జరుగుతున్న అండర్-23 పురుషుల అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీలో ఒడిశా యువ క్రికెటర్లు ప్రతిభ చూపుతున్నారు. శనివారం నిర్వహించిన మ్యాచులో ఒడిశా, బెంగాల్ జట్లు తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బెంగాల్ జట్టు 47.1 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఒడిశా జట్టు 31.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసి మ్యాచు గెలుపొందింది. ఒడిశా క్రీడాకారులు సాయిదీప్ మహాపాత్ర్ బౌలింగ్‌లో 4 వికెట్లు తీసుకోగా, ఉమేష్ కె గౌతమ్ 91 బంతుల్లో 117 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు.

మన్‌కీబాత్ రాష్ట్రానికి గుర్తింపు తెస్తోంది: సీఎం


సీఎంకు గజమాలతో సత్కారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినెలా చివరి ఆదివారంలో చేపడుతున్న మన్‌కీ బాత్ (మనసులో మాట) కార్యక్రమం రాష్ట్రానికి ఎంతో గుర్తింపు తెస్తోందని, తెలియని అంశాలు, విభిన్న రంగాల్లో రాణించి ఆదర్శప్రాయంగా నిలుస్తున్న వారి గురించి తెలియపరుస్తున్నారని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లోని నయాపల్లి బాలుంకేశ్వరాలయంలోని ఆవరణలో మోదీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేశారు. నేతలు, అభిమానులతో కలసి పాల్గొన్న సీఎంకు ఇక్కడ సత్కరించారు.

విహారయాత్రకొచ్చి...దోపిడీకి గురై


దోపిడీకి కొద్ది క్షణాల ముందు సెల్ఫీలో బాధిత విద్యార్థులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలోని దేవ్‌మాలి పర్వతంపై విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులకు శనివారం రాత్రి దోపిడీకి గురయ్యారు. సునాబెడ ఎస్డీపీవో సుమిత్ర జెనా అందించిన వివరాల ప్రకారం...కొరాపుట్‌కు చెందిన కునాల్ టాకిరి, ఉషశ్రీ సేనాపతి, శ్రేష్ఠ సేనాపతి, చంద్రికా, లింగరాజ్ కోసల అనే విద్యార్థులు శనివారం మధ్యాహ్నం దేవ్‌మాలి పర్వతంపైకి విహార యాత్రకు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడ సరదాగా గడిపి రాత్రి ఇళ్లకు తిరిగొస్తుండగా శిఖరం కింద భాగంలో చీకటిలో కొంతమంది గుర్తు తెలియని వారు వీరిపై దాడి చేశారు. రాళ్లు, ఆయుధాలతో దాడులు జరిపి రెండు చరవాణులు, బంగారు ఆభరణాలు, రూ.7 వేల నగదును దోచుకున్నారు. విద్యార్థులు ప్రాణభయంతో అక్కడ నుంచి కుందిలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధిత విద్యార్థులు దీనిపై సునాబెడ ఎస్డీపీవో సుమిత్రజెనాకు సమాచారం అందించగా వెంటనే ఆమె కొరియా ఠాణా పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొరియా పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మోసం కేసులో నిందితురాలి అరెస్టు


నిందితురాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులు సేకరించిన సొమ్ముతో ఓ సభ్యురాలు పరారైనట్లు సంఘానికి చెందిన ఓ మహిళ సమీన్ బేగం జూన్ నెలలో పట్టణ ఆదర్శ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితురాలను హైదరాబాదులోని యూసఫ్‌గూడ హైలం కాలనీలో శనివారం అరెస్టు చేసి తీసుకొచ్చినట్లు తెలిపారు.

కాలువ ఇలా.. మురుగు పారేదెలా

ఇచ్ఛాపురం పట్టణంలోని ఆరు వీధుల నుంచి వచ్చే వాడుక, వర్షపునీరు గిలాయివీధి మీదుగా చెరువుకు చేర్చాల్సిన కాలువ ఇది. వర్షాకాలానికి ముందే పూడిక తీసి, గట్లను పటిష్ఠం చేయాల్సి ఉన్నా ఆ చర్యలు కనిపించలేదు. దీంతో నీరు ముందుకు సాగే మార్గం లేక రోడ్డుపై నిలిచిపోతోంది. సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



పట్టణంలోనూ పల్లె కష్టాలు



సుమారు పదేళ్ల కిందట ఏర్పడిన లాలాపేట సూర్యవీధికి ఇప్పటికీ సరైన రోడ్డు, కాలువ వ్యవస్థ లేదు. ఇక్కడ భారీ భవనాలు ఉండటంతో పురపాలకసంఘానికి బాగానే ఆదాయం వస్తున్నా సదుపాయాల కల్పన అంతంతమాత్రమే. సాధారణ రోజుల్లో నడవడానికి ఇబ్బంది పడే స్థానికులు వర్షం పడితే బురదతో నానా పాట్లు పడుతున్నారు. పుర కమిషనర్ నల్లి రమేష్ వద్ద ప్రస్తావించగా రహదారుల అభివృద్ధికి నిధులు రానున్నాయని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పరిసరాలు అధ్వానం.. భవనం నిరుపయోగం

వజ్రపుకొత్తూరు మండలం పల్లిపురం కూడలిలో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనమిది. పరిసరాలు పనికిరాని మొక్కలతో అధ్వానంగా తయారవ్వడంతో నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు వేచి ఉండేందుకు అవస్థలు పడుతున్నారు. యాజమాన్యం, మెళియాపుట్టి తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. దీనిపై మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



అడ్డుగా స్తంభం.. మేం పట్టించుకోం



ఇచ్ఛాపురం పుర పరిధి బెల్లుపడకాలనీ మూడో మార్గం చిన్నవీధిలో ఓ విద్యుత్తు స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉంది. అసలే ఇరుకురోడ్డు.. ఆపై స్తంభం అడ్డు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను విద్యుత్తు ఏఈ గోవిందరావు వద్ద ప్రస్తావించగా స్తంభం వేసినప్పుడు కచ్చారోడ్డు మాత్రమే ఉండేదని, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రహదారి నిర్మాణం పూర్తి చేశారు

సాబకోట పంచాయతీ కారిగాం రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సింగుపురం రహదారి నుంచి బొందుకారి మార్గాన్ని కలుపుతూ వైకాపా తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సగంలో వదిలేసింది. కూటమి వచ్చాక రాళ్లు పరచి చాలారోజులు వదిలేయడంతో గిరిజనులు అసౌకర్యానికి గురయ్యేవారు. దీనిపై ఈ నెల 8న 'రాళ్ల రప్పలు.. రాకపోకలకు తిప్పలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఐటీడీఏ అధికారులు స్పందించారు. గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చి అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. – న్యూస్‌టుడే, మందస



ఆకట్టుకున్న పుష్పాలంకరణ

చీడిపూడి గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి శనివారం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త వంశీయులతో పాటు స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – న్యూస్‌టుడే, సారవకోట



బస్టాండ్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో నమూనా బస్టాండు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెదేపా మండలాధ్యక్షుడు పైల బొజ్జి, పట్టణ కమిటీ అధ్యక్షుడు సైలాడ సతీష్‌లు శనివారం తెలిపారు. కొన్నేళ్లుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఐటీడీఏ నుంచి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. దీంతో శనివారం పాత భవనం తొలగించే పనులు చేపట్టారు.

ప్రమాదకర మలుపు.. జీవితాల్లో కుదుపు

వేగ నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు లేక తప్పని అవస్థలు

– న్యూస్‌టుడే, హిరమండలం, పాతపట్నం, కొత్తూరు

పాతపట్నం నియోజకవర్గంలో ప్రధాన రహదారులపై మలుపులు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పనికిరాని మొక్కలు, తుప్పలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేగ నియంత్రికలు, హెచ్చరిక సూచికలు లేక రాత్రి సమయంలో పలువురు గాయపడిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.



గొట్టాబ్యారేజీ నుంచి సుభలయ మధ్య మలుపు వద్ద పెరిగిన పనికిరాని మొక్కలు

ఇదీ పరిస్థితి..

● గత మార్చిలో కొత్తూరు మండలం కొసలపాడు నుంచి బలద వెళ్లే మార్గంలో ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

● ఏప్రిల్‌లో పాతపట్నం మండలం తిడ్డిమి మీదుగా మెళియాపుట్టి వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఇదే నెలలో సుభలయ-గొట్టాబ్యారేజీ మధ్య మలుపులో యంబరాం గ్రామానికి చెందిన ఒక యువకుడు అదుపుతప్పి గాయపడ్డాడు.

● జులైలో కొత్తూరు మండలం ఇరపాడు-గొట్టిపల్లిలో రోడ్డులోని మలుపు వద్ద ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి.

● పాతపట్నం మండలం రొంపల్లి పురం, మెళియాపుట్టి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో మలుపుల వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనదారులు భారీ వాహనాలు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్‌ఎస్ కవిటి, గోపాలపురం, చినసద్బాపురం, తిడ్డిమి, దామసరం, పోసంగంపేట, బైదలాపురం తదితర గ్రామాల వెళ్లే రహదారుల వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

● హిరమండలం పరిధి గులుమూరు, కొండరాగోలు, దుర్గాలపురం, సుభలయ కూడలి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదల తొలగింపు పనులు చేపట్టలేదు. గొట్టాబ్యారేజీ నుంచి శ్రీముఖలింగం వెళ్లే రహదారి, భగీరథపురం నుంచి బొంతు కూడలికి వెళ్లే రోడ్డు పరిస్థితి అంతే.

● కొత్తూరు మండలం కలిగాం నుంచి బమ్మిడి, ఆర్ కేపురం సోమరాజపురం, అంగూరు రహదారికి ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగాయి. మెట్టూరు నుంచి లబ్బ వెళ్లే దారిది ఇదే పరిస్థితి. మాతల నుంచి పొన్నుటూరు, బంకి, దుగ్గ, కొమనాపల్లి, మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం, కరజాడ రోడ్డు, నేలబొంత, అలికాం రోడ్డు, చింతలపోలూరు, ఎల్‌ఎన్ పేట మండలం పూశాం, చొర్లంగి, కడగండి తదితర గ్రామాల్లో మలుపుల వద్ద వేగనియంత్రికలు లేని దుస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం..

రహదారులు, భవనాల శాఖ పరిధిలో ఉన్న రహదారుల్లో మలుపుల వద్ద పొదల తొలగింపు పనులు చేపడతాం. వేగ నియంత్రికలు, సూచికలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- విశాల్‌గుప్తా, ఆర్‌అండ్‌బీ డీఈఈ

పేరు గొప్ప- అభివృద్ధి లేదబ్బా

పుర పాలక సంస్థ పరిధిలో వెంటాడుతున్న మౌలిక సమస్యలు



వెండింగ్ జోన్ దుస్థితి

సిమిలిగుడ, గుణుపురం, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పేరు గొప్పది కానీ సమస్యలకు మాత్రం పుట్టినిల్లు అని చెప్పొచ్చు. మౌలిక సదుపాయాలు కల్పనలో పురపాలక సంస్థ పూర్తిగా విఫలమవుతుందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. 1965లో పాలక సంస్థగా ఏర్పాటైంది. తొలి రోజుల్లో నామినేటెడ్ కౌన్సిలర్లు పనిచేస్తుండేవారు. 1995లో తొలిసారిగా కౌన్సిలర్ పదవి కోసం ఎన్నికలు జరిగాయి. పాలక సంస్థ అధ్యక్షులు నియమితులయ్యారు. 2014లో పాలక సంస్థ నుంచి పురపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయింది. 25 వార్డుగా పురపాలక సంస్థ పరిధిలో సుమారు 50 వేల జనాబా ఉన్నారు.

సత్కారాలేనా.. సమస్యలు పట్టించుకోరా

రాష్ట్రంలో పురపాలక సంస్థలు, ఎన్ఏసీలు, నగర పంచాయతీలు అన్ని చోట్ల స్వపరిపాలనా ఉత్సవాలు జరుపుకోడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలు సంస్థలను ఉత్తమమైనవిగా గుర్తించి పురస్కారాలు అందిస్తున్నారు. రాయగడ జిల్లా గుడారి ఎన్ఏసీ కూడా పురస్కారానికి ప్రకటించారు. 31వ తేదీన కార్యనిర్వాహక అధికారి, ఎన్ఏసీ అధ్యక్షురాలు భువనేశ్వర్‌లో అవార్డు అందుకోనున్నారు. సత్కారాలే కాని గుడారి సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 1972లో గుడారి ఎన్ఏసీ ప్రారంభమైంది. అయిదారు వేల జనాబా ఉన్న ఇక్కడ సమస్యలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో గుడారి వంశధార వంతెన మీద గ్రామీణ పనులు విభాగం నిర్మించింది. అప్రోచ్ రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. అయిదారు సంవత్సరాలు గడిచిన తరువాత ఇప్పుడు రహదారి పూర్తిగా పాడైంది. రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డును గ్రామీణ పనుల విభాగం వారు ఎన్ఏసీకి అప్పగించారు. ఎన్ఏసీ వారు తమ వద్ద నిధులు లేవని, వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామంటున్నారు.

★ కొరాపుట్ జిల్లా సునాబెడలో హాల్ టౌన్‌షిప్‌తోపాటు సిమిలిగుడ పట్టణాన్ని దాని పరిధిలో చేర్చగా రెండు జంట పట్టణాలు అభివృద్ధి విషయంలో పురపాలక సంస్థ వెనకబడి ఉందని చెప్పొచ్చు. సిమిలిగుడలో రోడ్లు, మురుగు కాలువల సమస్య తీవ్రంగా వేధిస్తుండడం, సునాబెడలో రోడ్ల దుస్థితి ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో వివిధ వార్డుల్లో చీకటి అలుముకుంటోంది. మహిళలు, చిన్నపిల్లలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ప్రజలకు ఉల్లాసం కలిగించే పార్కుల నిర్వహణ తీరు మరీ అధ్వానం.

కొంత చేశాం... ఇంకా చేస్తాం

పురపాలక సంస్థ ద్వారా అనేక పనులు జరిగాయి. మౌలిక సదుపాయాలపై దృష్టి పెడుతున్నాం. సిమిలిగుడలో డబుల్ రోడ్డు ఏర్పాటు, జనిగుడ డ్యాంలో బోటింగ్ విహార యాత్ర, సునాబెడ నుంచి సిమిలిగుడ వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుద్దీకరణ, స్మార్ట్‌పార్కులు ఏర్పాటుతోపాటు ఆదర్శ సునాబెడగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం.
– రాజేంద్రకుమార్ పాత్ర్, అధ్యక్షుడు, పురపాలక సంస్థ



గుడారిలో నిరుపయోగంగా వెండింగ్ జోన్

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

కొత్తూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని మాతల గ్రామంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ప్రధాన రహదారుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టాలన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు


సారవకోట, న్యూస్‌టుడే: బడి వయసు పిల్లలతో పనులు చేయించడం నేరమని, ఎక్కడైనా వారితో పనిచేయిస్తే సదరు యజమానిపై చర్యలు తప్పవని లేబర్ అధికారి జయశంకర్ (నరసన్నపేట) పేర్కొన్నారు. సారవకోటలోని పలు హోటళ్లు, కిరాణ దుకాణాలను ఆయన పరిశీలించారు. మందుల దుకాణాల అనుమతులు తనిఖీ చేశారు. ఐసీఆర్పీ జనార్దనరావు, కానిస్టేబుల్ జోగారావు పాల్గొన్నారు.

సీటు కోసం చిన్నారితో ఫీట్లు



స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం ఫీట్లు తప్పడం లేదు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఉదయం విశాఖ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు రాగా ప్రయాణికులంతా ఎక్కేందుకు డోర్ వద్దకు చేరుకున్నారు. వీరిలో మహిళలే అధికంగా ఉండటంతో కొంత మంది పురుషులు బస్సు అద్దాల వద్ద సీట్ల కోసం ప్రయత్నించారు. సీటు ఖాళీగా ఉందని తెలుసుకున్న ఓ వ్యక్తి తమ చిన్నారిని కిటికీలో నుంచి లోపలకు నెడుతున్న దృశ్యం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది.
– న్యూస్‌టుడే, పలాస

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ఇచ్ఛాపురం: హాకీ స్టిక్, బాల్ ఆకృతుల్లో విద్యార్థులు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు విద్యాలయాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వ్యాయామోపాధ్యాయులను సన్మానించారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం బృందం



సోంపేట: బారువలో క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రామారావు



కవిటి గ్రామీణం: క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ఎంఈవో ధనంజయ మజ్జి

అలరించిన హరే రామ సంకీర్తన

కొత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక సీతారామ ఆలయ ప్రాంగణంలో హరే రామ అఖండ నామ సంకీర్తన శనివారం ఘనంగా నిర్వహించారు. ఏడు రోజులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కొత్తూరుతోపాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అఖండ నామ సంకీర్తనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తులసీవరప్రసాద్, తాతబాబునాయుడు పొగిరి అర్జునరావు, రవి తదితరులు ఉన్నారు.

వంశధారలో నిలకడగా నీటి ప్రవాహం

హిరమండలం, న్యూస్‌టుడే: వంశధార నదిలో గొట్టాబ్యారేజీ వద్ద శనివారం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 5,888 క్యూసెక్కులుగా నమోదైంది. బ్యారేజీ వద్ద గరిష్ఠంగా 38.10 మీటర్ల స్థాయిలో నీటి నిల్వను అధికారులు కొనసాగిస్తున్నారు. 5 గేట్లు ఎత్తివేసి నది దిగువకు 3,610 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నట్లు డీఈఈ సరస్వతి తెలిపారు.

కోదండరామయ్యకు ప్రత్యేక పూజలు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా శనివారం మండలంలో బొర్రంపేట, చింతలబడవంజ, శ్యామలాపురం, శ్రీనివాస్‌నగర్, రావిచెంద్రి, ధనుకువాడ, కుసుమలపాడు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

స్కానింగ్ చేయాలా.. పది రోజులు ఆగాల్సిందే

రిపోర్టు కోసం మరో రెండు, మూడు దినాలు

జీజీహెచ్‌లో వేధిస్తున్న సాంకేతిక సిబ్బంది కొరత

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రేడియాలజీ విభాగంలో సాంకేతిక సిబ్బంది కొరతతో ఎంఆర్ఐ చేయించుకోవాలంటే కనీసం 10 రోజులు ఆగాల్సి వస్తోంది. రిపోర్టు కోసం మరో రెండు, మూడు రోజులు ఎదురు చూడాల్సివస్తోంది. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్ కేంద్రంలో సిబ్బంది లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. పైగా రేడియేషన్ గదులకు సమీపంలో గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

● జలుమూరు మండలం కొమనాపల్లికి చెందిన పద్మ సర్వైకల్ సమస్య ఉందని జీజీహెచ్ ఆసుపత్రిలో న్యూరోఫిజిషియన్‌ను సంప్రదించారు. వైద్యులు పరీక్షించి ఎంఆర్ఐ చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రిలో చేరి ఎంఆర్ఐ స్కాన్ చేయించుకునేందుకు వెళ్లగా పది రోజుల తర్వాత రమ్మని చెప్పి ఓ తేదీని కేటాయించారు. సమస్య తెలుసుకునేందుకు పది రోజులు ఆగాల్సిన పరిస్థితి ఉంటే. మరి చికిత్సకు ఇంకెన్ని రోజులు వేచిచూడాలో అని రోగి కుటుంబ సభ్యులు విస్తుపోతున్నారు.



ఎంఆర్ఐ పరీక్ష చేస్తున్న ఉద్యోగి

ఒక్కరితో కష్టం

2021లో ప్రారంభమైన ఈ సేవల్లో నెలకు 400 స్కానింగ్‌లు జరిగేవి. నేడు 2,300 మాత్రమే చేస్తున్నారు. వీటిలో 1800 సీటీ స్కానింగ్‌లు, 500 ఎంఆర్ఐలు స్కానింగ్‌లు జరుగుతున్నాయి. రెండింటిని ఒక్కరే చూడటంతో ఒకదాని తరువాత ఒకటి చేసేందుకు సమయం ఎక్కువగా తీసుకుంటోంది.

★ కాంట్రాస్ స్టడీస్ స్కాన్(సీఈసీటీ)లు చేసే సమయంలో ఔషధం తీసుకున్న రోగి.. ఇచ్చిన సమయం కన్నా మరో అర గంట ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావడంతో స్కానింగ్‌లో నాణ్యత తగ్గుతోంది. సిబ్బందిని పెంచితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని రోగులు కోరుతున్నారు.

సేవలపై ప్రతికూల ప్రభావం

మూడు షిఫ్టుల్లో సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లకు ఒక్కొక్కరు చొప్పున పనిచేయడం క్లిష్టతరంగా మారుతోంది. ఆరోగ్యశ్రీ, ట్రామా, స్ట్రోక్, హెడ్ ఇంజ్యూరీలు, అత్యవసర కేసుల సేవల నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

'మూడు షిఫ్టుల్లో ముగ్గురు సిబ్బందిని మాత్రమే నియమించారు. ఆ ప్రకారమే విధులు నిర్వహిస్తున్నారు. నియమాకాలు జరగకపోవడంతో ఇబ్బంది కలుగుతున్న మాట వాస్తవమే. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆ ముగ్గురు సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. సిబ్బంది కొరత సమస్యపై హెడ్ ఆఫీసుకు ప్రతిపాదనలు పంపించాం.' అని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు.

మలేరియా నియంత్రణపై సమీక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మలేరియా నియంత్రణకు సంబంధించి రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అశ్వథి.ఎస్ అధ్యక్షతన శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో సమీక్షా సమావేశం జరిగింది. మలేరియా, ఇతర అంటువ్యాధుల నియంత్రణకు అధికారులు చేపట్టిన కార్యక్రమాల గురించి కూలంకషంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మల్కాన్‌గిరి జిల్లాలో మలేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు వైద్య బృందాలను తరలించాలని నిర్ణయించారు. వరద పీడిత ప్రాంతాల్లో అంటువ్యాధులు విస్తరించకుండా తాత్కాలిక వైద్య శిబిరాలు నిర్వహించాలని అశ్వథి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్‌ఎం) రాష్ట్ర శాఖ సంచాలకురాలు డాక్టర్ బృంద.డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులతో ప్రిన్సిపల్ కార్యదర్శి అశ్వథి.ఎస్

ఆటల్లో రాణింపు

వాళ్లంతా పేదింట్లో పుట్టిన మాణిక్యాలు. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు, చిన్నచిన్న పనులు చేసుకునే వాళ్లే. అయినా కష్టపడి, కఠోర శ్రమతో చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. తల్లిదండ్రులతోపాటు గ్రామానికి, జిల్లాకి పేరు తెస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి కొందరి క్రీడాకారిణుల గురించి తెలుసుకుందాం రండి..
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, కవిటి, మందస

నడకలో నిలకడగా..



మాది కవిటి మండలం మెళియాపుట్టుగ. ఫిజియోథెరపీలో శిక్షణ తీసుకుంటున్నా. మా నాన్న బాలకృష్ణ చిన్న దుకాణం నిర్వహిస్తుండగా... తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. నేను 2025లో శ్రీకాకుళంలో నిర్వహించిన క్రాస్ కంట్రీ జిల్లా స్థాయి అండర్-18 విభాగంలో నడక పోటీ(వాక్ రేస్)ల్లో రెండో స్థానంలో నిలిచా. అదే సంవత్సరం తణుకులో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం సాధించా. అదే ఏడాది శ్రీకాకుళంలో నిర్వహించిన సౌత్ జోన్ అండర్-20 విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నా. 2025 బాపట్లలో జరిగిన అండర్-20 విభాగంలో ప్రథమ స్థానం సాధించా. 2025 గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించాలని సాధన చేస్తున్నా. – మొగిలిపురి శృతి, క్రీడాకారిణి

హైజంప్‌లో బంగారం



మాది కాశీబుగ్గ. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నా. తండ్రి దూర్వాసులు కూలి పనులు చేస్తుంటారు. తల్లి కుమారి టైలరింగ్ చేస్తుంటారు. నేను హైజంప్ సాధన చేస్తున్నా. 2024 అక్టోబర్‌లో భువనేశ్వర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ హైజంప్ పోటీల్లో బంగారు పతకం సాధించా. 2025 అక్టోబర్‌లో దుబాయ్‌లో జరిగిన యూత్ ఏసియన్ గేమ్స్‌లో పాల్గొన్నా. ఈ నెల తిరుపతిలో జరిగిన సౌత్ జోన్ స్టేట్ మీట్‌లో స్వర్ణం గెలిచా. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. – పోతనపల్లి యశ్విత, క్రీడాకారిణి

మరికొందరు..



గెలుపొందిన పతకంతో చాందిని

మందస కేజీబీవీలో ఎంఎల్‌టీ చదువుతున్న వై. చాందిని చదువుల్లో ప్రతిభ చాటుతూ క్రీడల్లోనూ రాణిస్తోంది. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సొంతం చేసుకుంది. జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు కఠోర సాధన చేస్తోంది. అదే పాఠశాలలో బి.జ్ఞానేశ్వరి, ఎస్.సింధు జావెలిన్ త్రోలో రెండో స్థానంలో నిలిచారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన చెందకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శనివారం నేలబొంతు గిరిజన ప్రాంతంలో రైతులకు ప్రత్యేక శిక్షణ అందించారు. వ్యవసాయ యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీ వెంకట్రావు, ఏవో దానకర్ణుడు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి



బీమా చెక్కు అందజేత

సారవకోట మండలం పనసలోవ గ్రామానికి చెందిన గార నీలయ్య కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్ష చెక్కును శనివారం అందించినట్లు స్థానిక ఏపీ గ్రామీణ బ్యాంక్ శాఖ మేనేజర్ పేడాడ వెంకటేశ్ తెలిపారు. నీలయ్య బ్యాంక్‌లో ఖాతాదారుడిగా పీఎంజేజేబీవై పొందారని, ఆయన మృతితో కుటుంబసభ్యులకు బీమా మొత్తాన్ని అందించినట్లు చెప్పారు. సిబ్బంది సౌజన్య, శ్రీధర్, సీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సారవకోట